క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

రేపల్లె రూరల్: మండలంలోని వివిధ పంచాయతీల్లో రూ.4.74కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండలం కన్వీనర్ గాదె వెంకయ్యబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు పాల్గొని, ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

'స్పందన'కు నాలుగు అర్జీలు

రేపల్లె రూరల్: ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు అర్జీలు అందినట్లు కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సీహెచ్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అందిన అర్జీలను వివరించారు. రంగు మారిన ధాన్యం సమస్యను పరిష్కరించాలని కోరుతూ 5వ వార్డు నుంచి ఒక అర్జీ, భూమికి సంబంధించిన అన్‌పోర్ట్ చేయబడిన సర్వే నంబరును పోర్ట్ చేయాలని కోరుతూ ఇసుకపల్లి నుంచి ఒక అర్జీ, నివేసన స్థలానికి సర్వే నిర్వహించాలని రేపల్లె మున్సిపాలిటీ నుంచి ఒక అర్జీ, నక్కావానిచెరువు వద్ద గృహస్తులొకరు విపరీతమైన శబ్ద కాలుష్యం చేస్తున్నారని సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ అందినట్లు తెలిపారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించనున్నట్లు చెప్పారు.

రంజాన్ నెల ప్రారంభం


భట్టిప్రోలు: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ నెల కఠోర ఉపవాసాలతో చేసే ప్రార్థనలు ఫలించాలని పలువురు ఆకాంక్షించారు. దివ్య ఖురాన్ రంజాన్ ఈ నెలలోనే ఆవిర్భవించింది. నమాజులు, ఉపవాసాలు, పుణ్య కార్యాలకు పవిత్ర మాసంగా భావించే రంజాన్ ప్రారంభమైన సందర్భంగా భట్టిప్రోలుతో పాటు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలోని సున్నీ మసీదు, వెల్లటూరు, పల్లెకోన, వేమవరం గ్రామాల్లోని ప్రార్థనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్యాగం, కమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక అయినటువంటి రంజాన్ మాసం సోమవారం ప్రారంభమైంది. ముస్లిం సోదరులు మసీదుల్లో సామూహిక ప్రార్థనలు, ఇఫ్తార్‌లలో అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పెసర్లంక(భట్టిప్రోలు): పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కార్తిక్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 56 మందికి రూ.4 వేలు వ్యయం చేసే పరీక్ష ప్యాడ్లు, పెన్నులను నిర్వాహకుడు ఎస్. కార్తిక్ అందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్కే మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు వైవీకే మూర్తి, అంబటి యాకోబు, నాగజ్యోతి, ప్రమీలారాణి, ఫౌండేషన్ సభ్యులు స్వర్ణలత, యన్నం సురేష్, దాసరి బసవరాజు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



భట్టిప్రోలు: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద చేనేత కార్మిక కుటుంబానికి పద్మశాలీ ఇంటర్నేషనల్ అసోసియేషన్ (పీవా-విజయవాడ) ఆపన్న హస్తం అందించింది. భట్టిప్రోలుకు చెందిన ఆకురాతి పోతురాజు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో పీవాను ఆశ్రయించాడు. ఈ సందర్భంగా సోమవారం పీవా భట్టిప్రోలు బ్రాంచ్ అధ్యక్షుడు తిరువీధుల దేవాజీ, కార్యదర్శి కటకం సాంబశివరావు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పీవాకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు రూ.లక్ష సామగ్రి వితరణ



బాపట్ల: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంటల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేడపాటి సత్యనారాయణ జాపకార్థం వారి కుమారుడు వెంకట్ వృక్ష నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు లక్ష రూపాయల విలువైన సామగ్రిని సోమవారం వితరణ చేశారు. రెండు టేబుల్స్, 15 కుర్చీలు, టీవీ, గ్రీన్ బోర్డు, రెండు ఫ్యాన్లు, ర్యాక్స్, బీరువాను అందజేశారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంఈఓ నిరంజన్, హెచ్‌ఎం యాతం సౌజన్య దాత మేడపాటి వెంకట్‌ను సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య వినతిపై సామగ్రిని అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



చెరుకుపల్లిలో సచివాలయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లిలో రూ.23 లక్షల వ్యయంతో సచివాలయం, గుళ్లపల్లిలో రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, చెరుకుపల్లి-2లో రూ.43.60 లక్షల వ్యయంతో సచివాలయం, తుమ్మలపాలెంలో రూ.21.80 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, రూ.20.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.10 లక్షలు కేంద్ర ప్రభుత్వ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మించారు. ఈ భవనాల ప్రారంభోత్సవంలో సోమవారం ఎంపీ మోపిదేవి పాల్గొని, వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంక్షేమాభివృద్ధి అందేలా సచివాలయం, ఆర్బీకేలు పనిచేస్తున్నట్లు చెప్పారు. కాలయాపన లేకుండా సేవలన్నీ ఒకే చోట అందుతున్నాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని, రైతులను అవమానకరంగా చూశారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వ్యవసాయాన్ని సీఎం వైఎస్ జగన్ పండగ చేశారన్నారు. నాణ్యమైన సేవలతో ఆర్బీకేలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.దివాకర రత్నప్రసాద్, వైసీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, సర్పంచ్‌లు ఎం.కోటేశ్వరరావు, చెన్ను శివమ్మ, దేవరకొండ వాణి, చీరాల చెంచు దేవి, ఎంపీటీసీలు నాగుల నరసింహారావు, పిట్టు శివసముద్రాలు, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, చీరాల ప్రసాద్ రెడ్డి, బండారు రామారావు చీరాల వెంకటేశ్వరరెడ్డి, తూము కోటేశ్వరరావు, మరివాడ శివప్రసాద్, పంచాయతీ రాజ్ డీఈ ప్రసాద్, డీఎల్‌పీఓ తాతా శివశంకరరావు, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు: పేద వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పరితపిస్తున్నారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని ఈపూరు, చిలుమూరు గ్రామాల్లో జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వరికూటి మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో పేదలు కష్టాలతో నష్టపోతుంటే.. చలించిన సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలను శ్మశాన స్థలాలతో పోల్చి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ప్రజలు మర్చిపోలేదన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న కాలనీలో 202 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను ఆయన పంపిణీ చేశారు. మండలంలోని చిలుమూరులో దశాబ్దాల తరబడి శాశ్వత పట్టాలు లేని సొసైటీ భూముల్లోని 130 మంది రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరుచేసిన శాశ్వత భూహక్కు పట్టాలను అందజేశారు. స్థానికంగా రూ. 9లక్షలతో నిర్మించిన నూతన అంగన్వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. టీడీపీ అభ్యర్థి నక్కా ఆనంద బాబు తనకు వేమూరు టికెట్ లేదని చేస్తున్న దుష్ప్రచారాలను ఎవ్వరూ నమ్మే పరిస్థితిలో వరికూటి అశోక్‌బాబు అన్నారు. తాను చాప చుట్టుకొని ఎక్కడకీ వెళ్లడం లేదని, తనకు ఓటు హక్కు వేమూరు నియోజకవర్గంలోనే ఉందని.. నియోజకవర్గం మొహం చూడని నక్కా ఆనందబాబు చాప, దిండు చుట్టుకొని ఇక్కడే కాపురం పెట్టే విద్ధంగా చేస్తానన్నారు. తాను పోటీలో ఉంటే ఓటమి కాయమని భయపడి ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఉప్పు శిరీష, సర్పంచి మంచాల వసుంధర, వైఎస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు పడమట వెంకటలక్ష్మి, అమిరిశెట్టి శ్రీధర్, ఈపూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ సూర్యదేవర రామకృష్ణ, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిద్ధం సభ విజయంతో టీడీపీ నేతల మతి చలించింది

వేమూరు: అద్దంకి విజయవంతమైన సిద్ధం సభకు వచ్చిన జనాభాను చూసి తెలుగుదేశం పార్టీ నాయకులకు మతి చలించిపోయిందని బీసీ నాయకుడు మోదుకూరి హరిబాబు పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు వేలమంది పార్టీ కార్యకర్తలు, ప్రజలతో తరలి వెళ్లి సిద్ధం సభను విజయవంతం చేసినట్లు తెలిపారు. దీంతో ప్రతిపక్ష నేత నక్కా ఆనంద్‌బాబు మతిచలించి అశోక్‌బాబుపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో వేమూరు నుంచి అశోక్‌బాబు విజయం ఖాయమన్నారు. ఎంపీటీసీలు ప్రతాప్, నరసింహారావు, గర్నెపూడి అజయ్, ఎస్.శివకుమార్, కామేనేని సాయి తదితరులు పాల్గొన్నారు.

హాల్ టికెట్లు అందజేత



హాల్‌టికెట్‌లు ఇస్తున్న ఎంఈఓలు

చెరుకుపల్లి: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవోలు పులి లాజర్ సూచించారు. గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 166 మంది పదో తరగతి విద్యార్థులకు హల్ టికెట్‌లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 టి.నవీన్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, హెచ్‌ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ చేయూత అందజేత

వేమూరు: జీవనోపాధికి పాడి గేదలు, కుట్టు మెషీన్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి శోభన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులో ఉదయం 11 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.102 కోట్ల నమూన నగదు చెక్కు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చెరుకుపల్లి: ప్రతి ఒక్కరూ గ్రామాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని బాపట్లలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జాన్‌వెస్లీ పేర్కొన్నారు. కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆరుంబాక వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల ఆవరణలో సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. ఆయా ప్రాంగణాల్లో 150 మొక్కలు నాటారు, అందులో ఉసిరి, జామ, వేప, నేరేడు, చింత, మందారం మొక్కలు ఉన్నాయి. అనంతరం కావూరు గ్రామంలో ఓటు హక్కు ప్రాధాన్యతను గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది డాక్టర్ మాధవ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ వీరప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యం, ఆదాయం పచ్చగా



పుచ్చకాయలు విక్రయిస్తున్న వ్యాపారి

- పట్టణంలో ఊపందుకుంటున్న పుచ్చకాయల వ్యాపారం
- నియోజకవర్గంలో వందలాది మందికి ఉపాధి
- సీజన్‌లో రూ.లక్షల్లో వ్యాపారం
- బాపట్లలో 200 ఎకరాల్లో సాగు



పట్టణంలో విక్రయానికి సిద్ధంగా పుచ్చకాయలు

బాపట్ల: వేసవి దగ్గరపడటంతో పుచ్చకాయలకు గిరాకీ పెరిగింది. భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఒక్క పుచ్చకాయ బద్ద తింటే ఆ మజానే వేరు. వెంటనే శరీర ఉష్ణోగ్రత క్రమబద్ధీకరించి లవణాలను, మినరల్స్‌ను అందించడంలో పుచ్చకాయదే మొదటి స్థానం. ప్రస్తుతం బాపట్ల పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 35 నుంచి 40డిగ్రీల సెంటీ గ్రేడ్ మధ్యలో ఉండటంతో వీటికి డిమాండ్ పెరిగింది. కాయ సైజును బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు పలుకుతోంది.

జోరుగా వ్యాపారం..

బాపట్ల పట్టణంలో సీజనల్ పుచ్చకాయల వ్యాపారం ప్రారంభమైంది. సన్న, చిన్నకారు వ్యాపారులు తోపుడు బండ్లపై, రోడ్ల పక్కన పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. గడిచిన పది రోజుల వ్యవధిలో బాపట్ల పట్టణంలో సుమారు 150 మందికి పైగా ఇదే జీవనోపాధిగా విక్రయాలు ప్రారంభించారు. బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం, పిట్టలవానిపాలెం, బాపట్ల మండలాల్లో సుమారు 200లకు పైగా పుచ్చకాయల విక్రయ దుకాణాలు వెలిశాయి. ప్రధానంగా జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలైన రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఆటో స్టాండ్‌లతో పాటు, ప్రధాన రహదారుల వెంబడి వ్యాపారులు జోరందుకున్నాయి. రోజుకు సగటున రూ.30వేలు నుంచి రూ.50 వేల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. ఈ సీజనల్ ముగిసేలోపు రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు అంటున్నారు.

పెరిగిన సాగు...

ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను పుచ్చకాయలు రూ.6 నుంచి రూ.11 వేలు వరకు ధర పలుకుతోంది. ఎకరాలో పుచ్చకాయలు సాగు చేసేందుకు సుమారు రూ.25 వేలు నుంచి 30 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. తేలికపాటి నేలలు, ఇసుక నేలల్లో ఈ పంటను సాగుచేసుకోవచ్చు. మొదట్లో నియోజకవర్గంలో నాలుగైదు ఎకరాల్లో మాత్రమే పండించేవారు. ప్రస్తుతం ఒక్క బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెం, పాండురంగాపురం, పిన్నిబోయినవారిపాలెం, వల్లువారిపాలెం ఈ నాలుగు గ్రామాల్లోనే సుమారు 150 ఎకరాల్లో సాగుచేస్తున్నారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడుదాం

ఎంపీపీ యారం వనజ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యారం వనజ

కర్లపాలెం: అభివృద్ధికి అందరూ కలసి కృషి చేయాలని ఎంపీపీ యారం వనజ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎంపీడీవో నేతాజీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాధాన్య క్రమంలో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ తన సెగ్మెంట్ పరిధిలో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయటం లేదని అధికారులను నిలదీశారు. అనంతరం కుర్చీపై నిల్చుని నిరసన తెలిపారు. ఎంపీపీ వనజ స్పందిస్తూ.. ఎంపీటీసీ సభ్యులందరికీ మండల పరిషత్ నిధులు విడుదలయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సుబ్బారావు, సీడీపీవో శైలజ, ఎంపీటీసీ సభ్యులు దిండి నాగలక్ష్మి, చీరాల పద్మావతి, గొర్ల కమల, ఎండీ అమీర్‌బేగ్, ఎస్కే ఆసిఫ్ అలీ, ఆర్.లక్ష్మణరావు, పి.సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాలు మంగళవారం నిర్వహించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భవించి 13 ఏళ్లు పూర్తి చేసుకుని 14వ ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంలో పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించాలని కోరారు. అలాగే చందోలు గ్రామంలో పేదలకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే కోన రఘుపతి పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా కోశాధికారి కూసంపూడి దేవేంద్రరాజు, పార్టీ నాయకులు కుంతం ప్రసన్నరాజు, బొలగాని సుబ్బారావు, గుమ్మడి సీతయ్య ఉన్నారు.

పురాణ కాలక్షేప మండపానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘుపతి

బాపట్ల: బాపట్లలోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో నిర్మించ తలపెట్టిన పురాణ కాలక్షేప మండప పనులు త్వరగా పూర్తి కావాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పురాణ కాలక్షేప మండపం నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో దేవాలయ పునఃనిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, కృష్ణమాచార్యులు, భావనారాయణ, విఖనస మూర్తి, సత్యంబాబు, రామకృష్ణ భార్గవ, నెమలికంటి హనుమంతరావు, పూసపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేత



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: చెస్ క్రీడల వల్ల క్రీడాకారుల్లో మేధో సంపత్తి మెరుగు పడుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. రెండు రోజులుగా నగర శివారుల్లోని లాం నందు చలపతి ఫార్మసీ కళాశాలలో కళాశాల, ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 265 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. విజేతలకు రూ.53 వేల నగదు బహుమతిని అందజేయటం జరిగిందన్నారు. ఓపెన్ కేటగిరీలో గుంటూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి విజేతగా నిలిచాడన్నారు. నాలుగు కేటగిరీలలో ప్రతి కేటగిరీ నుంచి మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో వెంకటేశ్వర్లు, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్, పీడీ పీ భానుప్రకాష్ పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల పీవైపీ ఎక్స్‌పో

పెదకాకాని: 'వివా ది స్కూల్' నందు ఇంటర్నేషనల్ బాకలారియేట్ పీవైపీ (ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్) చివరి సంవత్సరం విద్యార్థులు వారు అభ్యసించిన అంశాలపై నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ ఎక్స్‌పో(పీవైపీ ఎక్స్) వేదిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఐబీ విద్యావిధానం ద్వారా వారు అభ్యసించిన విద్య, విద్యేతర అంశాలలో ప్రావీణ్యం సాధించిన నైపుణ్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శించారు. ఇటీవల కాలంలో విద్యార్థులు సందర్శించిన పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టతను తెలియజేస్తూ రాసిన వ్యాసాలు, ఫోటోలు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సందర్శించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని వీక్షించారు. అనంతరం విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కెఎస్ రావు, ప్రిన్సిపల్ సీహెచ్ సరళ, ఐబీ సమన్వయకర్త కె మాధవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వైద్య సేవలు

రేపల్లె రూరల్: మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని నైట్ షెల్టర్‌లో సోమవారం ఓల్డ్ టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికంగా ఆశ్రయం పొందుతున్న వారికి వైద్యసేవలు అందించారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ ప్రారంభించారు. షెల్టర్‌కు మెప్మా సహకారంతో అందించిన వాటర్‌కూలర్‌ను ఆమె ప్రారంభించారు. డాక్టర్ రెహమాన్ 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, టీకేవీ గుప్త, మెప్మా సీఎంఎం విజయ, షెల్టర్ నిర్వాహకుడు కొండపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపల్లె పట్టణంలో పోలీసు కవాతు

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికలకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని రేపల్లె డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో సోమవారం పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్పందిస్తూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రశాంత వాతావరణంలో జరిగేలా తమ సిబ్బంది పనిచేస్తారన్నారు. నియోజకవర్గంలో గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అల్లర్లకు పాల్పడిన వారిని బైండోవర్ చేశామన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటరు నుంచి నెహ్రూ బొమ్మ మీదగా రింగు రోడ్డు వరకు, ప్రకాశం రోడ్డు నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు కవాతు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు నజీర్ బేగ్, మల్లికార్జునరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ ద్రోహి చంద్రబాబు

భట్టిప్రోలు: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికారం కోసం బీజేపీతో పొత్తుపెట్టుకుని మరోమారు మైనార్టీ ద్రోహిగా నిలిచారని కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ సోమవారం విమర్శించారు. గతంలో గుజరాత్‌లో ముస్లింలను ఊచకోత కోసిన విషయం ఇంకా మరిచిపోలేదన్నారు. తన అవసరానికి ఎప్పుడు ఎవరితోనైనా పొత్తులు పెట్టుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రాష్ట్రం వెనుక బాటుకు ప్రధాని మోది కారణమని మాట్లాడిన చంద్రబాబు ప్రసంగాలు నేటికి ప్రజలకు గుర్తున్నాయన్నారు. మరలా అధికారం కోసం మోదీని కీర్తించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ముస్లింలు చంద్రబాబు కూటమికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.